క్లుప్తంగా

చైర్‌పర్సన్‌కు అభినందన



స్వర్ణను అభినందిస్తున్న నేతలు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కో–ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన యర్రంరెడ్డి స్వర్ణను వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం అభినందించారు. ఆమె స్వగ్రామం రేబాలలోని ఇంటి వద్ద దామర మడుగు నాయకులు, కార్యకర్తలు శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, నాగేంద్ర, ప్రదీప్, రషీద్, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

బెదిరించి నగదు వసూలుపై కేసు నమోదు

పొదలకూరు : అక్షరమే ఆయుధం అనే యూట్యూబ్ చానల్ విలేకరి షఫీపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలో చిన్నపాటి దుకాణం నిర్వహిస్తున్న యువకుడిని బెదిరించి నగదు వసూలు చేయడంపై అతను పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై కరిముల్లా షఫీపై కేసు నమోదు చేశారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



మాట్లాడుతున్న పెంచలరెడ్డి

కోవూరు : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా రాణించాలని రిటైర్డ్ ఓఎస్‌డీ పెంచలరెడ్డి అన్నారు. మండలంలోని అరుంధతీ ఎయిడెడ్ పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నెల్లూరు మోడరన్ విద్యా సంస్థల అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, అరుంధతీ పాఠశాల హెచ్‌ఎం అరుంధతీ, ఎమ్మార్పీస్ రాష్ట్ర నేత మందా రవికుమార్ పాల్గొన్నారు.

రగ్బీ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో అసోసియేషన్ సభ్యులు

కొడవలూరు : మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా రగ్బీ జూనియర్ బాలుర జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. ఈ జట్టుకు ఉదయగిరి నుంచి టీవీ మనోహర్, శశికుమార్, వెంకటేష్, సూళ్లూరుపేట నుంచి పి.జస్వంత్, పి.మోహిత్‌సాయి, గండవరం నుంచి షేక్.సిరాజ్, జె.జ్ఞానేష్ కుమార్, జె.సాగర్, కె.మహిధర్, షరీఫ్, ఫిరోజ్, కార్తీక్, శరత్, సాయి మహంత్‌లు ఎంపికయ్యారు. ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 30, వచ్చే నెల 1న కర్నూలు ఆదర్శ విద్యామందిర్ హైస్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ రగ్బీ పోటీల్లో పాల్గొంటారని జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి, ఉపాధ్యక్షులు పి.రమేష్, జె.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు సభ్యులకు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ సతీష్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోచ్ దాసరి వంశీకుమార్, సభ్యులు మల్లిక్, ఎన్.భాను, రత్నం పాల్గొన్నారు.

బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక రేపు

నెల్లూరు(బృందావనం): స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని డీఎస్సార్ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటలకు పంచమ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. శ్రీగాయత్రి కల్యాణమస్తు బ్రాహ్మణ ఉచిత వివాహ సమాచార కేంద్రం, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి సంయుక్త సహకారంతో వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉభయ తెలుగురాష్ట్రాల పరిధిలో నిర్వహిస్తున్న ఉచిత వివాహ పరిచయ వేదికను బ్రాహ్మణ సంఘీయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 98484 86599, 79013 54004 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థిని అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): కళాశాల విద్యార్థిని అదృశ్యంపై బాలాజీనగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్రామికనగర్‌లో కృష్ణమూర్తి కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమార్తె నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఈ నెల 27న రోజూలాగే కుమార్తెను తండ్రి కళాశాలలో వదిలిపెట్టారు. సాయంత్రం ఇంటికి తీసుకొచ్చేందుకు కళాశాల వద్దకెళ్లగా అప్పటికే వెళ్లిపోయిందని కళాశాల సిబ్బంది తెలిపారు. కుమార్తె ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో బాలాజీనగర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

మహా కుంభాభిషేకానికి అంకురార్పణ

- శాస్త్రోక్తంగా జరిపించిన అర్చకులు



పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో కొలువైన ప్రసిద్ధ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో మహా కుంభాభిషేక వేడుకలకు సంబంధించి అంకురార్పణ కార్యక్రమాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత అర్చకులు మహా సంకల్ప యాగాన్ని చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, గ్రహప్రీతి, మృత్యుంగ్రహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉభయకర్తలైన కొలన్ పూజిత ఆధ్వర్యంలో అర్చకులు, ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు కలిసి ఆలయ సమీపంలో పెన్నానది వద్దకు వెళ్లి ముందుగా పుట్టమట్టిని సేకరించారు. అలాగే సప్త నదీ జలాల్లో భాగంగా పెన్నానది జలాలను కలిశాలలో తీసుకున్నారు. అనంతరం మట్టి శుద్ధి, జల శుద్ధి కార్యక్రమాలను చేపట్టి, అక్కడి నుంచి వాటిని మేళతాళాల నడుమ ఆలయ హోమశాల వద్దకు తీసుకొచ్చారు. అనంతరం కలిశ స్థాపన చేసి శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేక వేడుకలకు అంకురార్పణ చేశారు. ఈ సమయంలో ఉభయకర్తలు, అధికారులు, పాలక మండలి సభ్యులకు అర్చకులు రక్షాబంధనాన్ని కట్టారు. అంకురార్పణ అనంతరం నవగ్రహ పూజ, ఆచార్య వరణం, లఘుపూర్ణాహుతి, వాస్తు పూజ, వాస్తు హోమ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో గణపతి స్వామి, సుబ్రహ్మణ్యం స్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలకు విశేషంగా తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు, కొలన్ రాజారెడ్డి, పూజిత ఉభయకర్తలుగా వ్యవహరించగా, పాలకమండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, పద్మ, సుప్రజ, విజయమ్మ, విమల, శశిశేఖర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



మట్టిశుద్ధి, జలశుద్ధి చేస్తున్న అర్చకులు



నదీ జలాలను తీసుకొస్తున్న ఉభయకర్తలు, పాలకమండలి సభ్యులు



ప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

ఇక్కడి గ్రామాలతో విడదీయరాని బంధం



నందివాయలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : మండలంలోని అయ్యగారిపాళెం, నందివాయ గ్రామాలతో తన కుటుంబానికి విడదీయరాని బంధం ఉందని, అందుకనే తోడేరు సచివాలయంలో ఈ రెండు గ్రామాలను కలిపినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నందివాయ, అయ్యగారిపాళెం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం మంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో రూ.1.90 కోట్లతో సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్లను ప్రారంభించారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డి హయాం నుంచి ఈ గ్రామాలు సొంత ఊరితో సమానమన్నారు. ముఖ్యంగా ఎస్సీకాలనీల ప్రజలు తమ కుటుంబాన్ని సొంత కుటుంబంగా భావించి మా వెంట నడిచినట్లు పేర్కొన్నారు. తన తండ్రి సమితి అధ్యక్షుడిగా పనిచేసి 28 సంవత్సరాల తర్వాత తిరిగి మా కుటుంబం రాజకీయంగా ఎదిగిందంటే మానవ సంబంధాలను కొనసాగించడమేనన్నారు. ఈ రోజుల్లో రాజకీయాల్లో స్వల్ప విరామం వచ్చినా కొనసాగడం కష్టమని, అయితే రెండున్నర దశాబ్దాలకు పైగా తమ కుటుంబం ఎలాంటి పదవులు లేకుండా ప్రజలతో మమేకం కావడం వల్లనే తాను మంత్రిని కాగలిగినట్లు చెప్పారు. మండలంలో కార్యకర్తలు తన తండ్రి రమణారెడ్డి తనకు ఇచ్చిన ఆస్తిగా పేర్కొన్నారు. వారి రుణం తీర్చుకునేందుకే ఉద్యమంలా అభివృద్ధి పనులు చేపట్టి రూ.100 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. మంత్రి రాక సందర్భంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, సర్పంచ్‌లు కండే వసంతమ్మ, కలికి ప్రమీలమ్మ, ఎంపీటీసీ సుగుణ, నాయకులు శశిధర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, చెంచురామయ్య, శ్రీనివాసులురెడ్డి, గోపాలయ్య, నరసింహులు, రాధాకృష్ణయ్య, పెంచల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఫలితాల సాధన హర్షణీయం

- డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు



విద్యార్థినిని సన్మానించి ప్రోత్సాహకాలు అందజేస్తున్న చలపతిరావు

కొడవలూరు : నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్‌లోని ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం హర్షణీయమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కొనియాడారు. ఇక్కడి హైస్కూల్ ప్లస్‌లో తొలిసారిగా ఫస్టియర్ ఇంటర్ ప్రవేశ పెట్టగా అందులోని విద్యార్థులంతా వంద శాతం ఉత్తీర్ణులవడంతో పాటు ఎంపీసీలో పి.చైతన్య జ్యోతి 470 మార్కులకు 408 మార్కులు, బైపీసీలో యు.మనోజ్ఞ 440 మార్కులకు 399 మార్కులు సాధించి టాపర్‌లుగా నిలిచారు. అదేవిధంగా సబ్జెక్టుల వారీగా మ్యాథ్స్‌లో ఎ.కీర్తన, కె.సురేష్‌బాబు, బోటనీలో ఒ.శ్రీలక్ష్మి, జువాలజీలో డి.రామాంజనమ్మ, ఫిజిక్స్‌లో వి.లక్ష్మీగాయత్రి, కెమిస్ట్రీలో ఎస్.శైలజ, సంస్కృతంలో కె.బాలసుందర్, ఇంగ్లిష్‌లో పి.హరిబాబు అధిక మార్కులు సాధించారు. వీరిని కళాశాలలో శుక్రవారం శాలువాలతో సన్మానించి ప్రోత్సాహక బహుమతులను అందించారు. మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని చలపతిరావు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జి.వసంతకుమారి, ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ సుప్రియ, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, హెచ్‌ఎం ఓబులేసు పాల్గొన్నారు.

నేడు ఈదగాలిలో మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం మండలంలోని ఈదగాలి గ్రామంలో పర్యటిస్తారని ఎంపీటీసీ సభ్యుడు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సాయంత్రం నాలుగు గంటలకు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. ఆదివారం సాయంత్రం కూడా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలోనూ మంత్రి కాకాణి పాల్గొంటారని తెలియజేశారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

పొదలకూరు : పట్టణంలోని కాకతీయ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ప్రతిభ కనపరిచారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో ఎ.శివశంకర్ 987, కె.శ్రీలక్ష్మి 986, టి.కమలిని 982 మార్కులు సాధించారు. బైపీసీలో డేగా కీర్తి 981, సీహెచ్ శిల్పిక 959 మార్కులు కైవసం చేసుకున్నారు. సీఈసీలో పూజిత 909, వై.వేణుగోపాల్ 908 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో బి.భావన 470 మార్కులకు 445, ఎస్‌కే నిజాముద్దీన్ 437, ఎ.సుప్రజ 436, బైపీసీ గ్రూపులో బి.సునంద 376 మార్కులు సాధించారు. సీఈసీ గ్రూపులో జి.ప్రశాంతి 416, హర్షితలక్ష్మి 396 మార్కులను కైవసం చేసుకున్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల శుక్రవారం కరెస్పాండెంట్ సంగన శివశంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఏఓ ప్రభాకర్ అభినందించారు.

అనారోగ్యంతో డ్రైవర్ మృతి

ముత్తుకూరు : లారీలో సరుకు అన్‌లోడ్ చేసేందుకు ఢిల్లీ నుంచి వచ్చిన ఓ డ్రైవర్ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. ఎస్సై శివకృష్ణారెడ్డి కథనం మేరకు.. రాజస్థాన్‌లోని అల్వార్‌కు చెందిన ముకేష్‌కుమార్ అనే డ్రైవర్ ఈనెల 20న ఢిల్లీ నుంచి లారీ లోడుతో బయలుదేరాడు. చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నంలో ఉన్న జిందాల్ కంపెనీలో సరుకు అన్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో పంటపాళెంలోని బైపాస్‌రోడ్డులో లారీని నిలిపి, కాలకృత్యాలు తీర్చుకున్నాడు. ఆ వెంటనే ఫిట్స్ రావడంతో పడిపోయాడు. చుట్టుపక్కల వారు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన



విజయోత్సవంలో గృహసారథులు, నాయకులు

ముత్తుకూరు : మండలంలోని తాళ్లపూడి సచివాలయ పరిధిలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పూర్తయిన సందర్భంగా శుక్రవారం విజయోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సచివాలయ పరిధిలోని తాళ్లపూడి, మామిడిపూడి పంచాయతీల్లో కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఈ సందర్భంగా సర్పంచ్ కె.మస్తానమ్మ, ఉప సర్పంచ్ ఎ.గోపాల్ అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధనరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం పట్ల ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని చెప్పారు. సచివాలయ కన్వీనర్‌లు దువ్వూరు హరికృష్ణ, షేక్.గౌస్‌బాషా, కోట సుధీర్, అల్లంపాటి నాగరాజు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సై సుబ్బారావు

కొడవలూరు : త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జి.సుబ్బారావు చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరింపజేశారు. త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించిన క్యాలెండర్‌లను పోలీసుస్టేషన్‌తో పాటు ప్రభుత్వాస్పత్రి, తహసీల్దార్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు డి.సురమౌళి మాట్లాడుతూ ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరస్వామి వారు రచించిన ఈ తెలుగు క్యాలెండర్‌లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించినట్లు తెలిపారు. సరళమైన తెలుగు భాషలో క్యాలెండర్‌ను రూపొందించడం వల్ల అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు శేఖర్‌బాబు, శ్రీనివాసరావు, సుమలత, లీలావతి, రాజేశ్వరి, శ్రీదేవి, జ్యోతి పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో అధిక లాభాలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మనుబోలు : ప్రకృతి వ్యవసాయ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని అక్కంపేట సర్పంచ్ నారపరెడ్డి జాంభవతమ్మ అన్నారు. ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్‌పై డీపీఎం మాల కొండయ్య ఆదేశాల మేరకు అక్కంపేట గ్రామంలో శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామ సంఘాల వారీగా 2023–24 సంవత్సర కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రాజోలుపాడు, అక్కంపేట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై సిబ్బంది వరలక్ష్మి, శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసారం పెంపు ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమన్నారు. రసాయనాల బదులు ఘన ద్రవ జీవామృతం వేస్తే భూమి సారవంతం అవుతుందన్నారు. వివిధ రకాల పంటల సాగు వల్ల భూమిలో పలు రకాల సూక్ష్మజీవులు పెరిగి ప్రధాన పంటకు కావల్సిన అన్ని పోషకాలు అందుతాయన్నారు. నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఐసీఆర్పీలు ప్రమీల, వనకుమారి, పవన్, వెంకటరమణయ్య, గీత, ప్రముద తదితరులు పాల్గొన్నారు.

దినేష్‌రెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో



మాట్లాడుతున్న దళిత నేతలు

బుచ్చిరెడ్డిపాళెం : దళితులను కించపరిచేలా మాట్లాడిన కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని దళిత బహుజన సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి బాబురావు కోరారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ భవనంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల దినేష్‌రెడ్డి కొడవలూరు మండలం, నార్తురాజుపాళెంలో దళిత నేత వీరి చలపతిరావుతో పాటు దళితులనంతా కించపరిచేలా మాట్లాడారని గుర్తుచేశారు. దళితులు తలచుకుంటే దినేష్‌రెడ్డి తలరాత మారిపోతుందని హెచ్చరించారు. గతంలో కూడా చంద్రబాబు, లోకేశ్ దళితులను హేళన చేసి మాట్లాడారని, ప్రస్తుతం దినేష్‌రెడ్డి దళితులను కించపరిచేలా మాట్లాడటం మంచిది కాదన్నారు. అనంతరం సీఐ కార్యాలయంలో దినేష్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు శివరామ్, నాయకులు అంకులయ్య, మాల్యాద్రి, చెన్నయ్య, రమణయ్య, భాస్కర్, వెంకటస్వామి, ఎం.రమణయ్య పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



భూసర్వేను ప్రారంభిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మనుబోలు : రీసర్వేతో ఎంతో కాలంగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రీసర్వే తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడ్లపూడి గ్రామంలో డ్రోన్ సాయంతో జరుగుతున్న రీసర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే పూర్తయితే కచ్చితమైన కొలతలు తెలుస్తాయని, దీని ద్వారా రైతుల సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. ఏ రైతుకు ఎంత పొలం ఉందో కచ్చితమైన కొలతలు తెలుస్తాయన్నారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ రమాదేవి, డీటీ బాలకోటమ్మ, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, వీఆర్వో శ్రీనివాస్, భక్తవత్సలరెడ్డి, విలేజ్ సర్వేయర్లు మధు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధూళి జాతర



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

ఇందుకూరుపేట : ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారికి శుక్రవారం ధూళి జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవానికి నెల రోజుల ముందు ఈ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించడం సంప్రదాయం. కార్యక్రమంలో భాగంగా అమ్మవారిని ఆలయం వద్ద నుంచి మేళతాళాలతో గ్రామానికి చేరుస్తారు. గ్రామోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను స్థానిక శివాలయంలో కొలువుదీరుస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం రోజు తిరిగి అమ్మవారు గ్రామం నుంచి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. ప్రతి ఏడాది లాగే ఈసారి ధూళి జాతరను గ్రామస్తులు వేడుకగా నిర్వహించారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది.

విద్యతోనే ఉన్నతస్థాయి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వరిగొండ గమళ్లపాళెంలోని సేజ్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో శుక్రవారం రాత్రి జరిగిన వార్షికోత్సవ వేడుకుల్లో మంత్రి కాకాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమన్నారు. ఆట పాటలతో పాటు చదువులోనూ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. జీవితంలో ఏదైనా సాధించాలన్నా కేవలం మంచి విద్యతోనే సాధ్యపడుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సైతం అమ్మఒడి పథకాన్ని అందిస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, స్థానిక నేతలు కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఒబ్బారెడ్డి సురేష్‌రెడ్డి, నెల్లిపూడి సునీల్‌రెడ్డి, కోసూరు రవీంద్రయ్య, పాఠశాల కరెస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్ ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని దామరమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంక్ ఆర్‌ఎం కె.జోగారావు నూతనంగా ఏర్పాటు చేసిన సైకిల్ స్టాండ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంక్ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థుల అవసరాల నిమిత్తం దాదాపు రూ.లక్ష నగదుతో సైకిల్ స్టాండ్‌ను నిర్మించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, బ్యాంక్ మేనేజర్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవం

పొదలకూరు : ఈనెల 30న పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి జయంతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని దేవస్థానం కమిటీ కార్యదర్శి రాచపూటి రామలింగయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు పంచామృత అభిషేకం, 8 గంటలకు గోపూజ, 8.30కి అలంకరణ, 11కు లలితా సహస్రనామపూజ, ఖడ్గమాల, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, 12.30కి తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. సాయంత్రం 6.30కి సామూహిక మల్లెల అర్చన నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు.